ప్రజాశక్తి

బుధవారం 29 మార్చి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గడువు ముగిసినా పూర్తవ్వని లక్ష్యం



ప్రత్తిపాడు మండలం కోండెపాడు లే అవుట్‌లో గత నెలలో పునాది దశలో ఉన్న ఇల్లు

- జగనన్న కాలనీల్లో గృహనిర్మాణం మందగమనం
- లక్ష్యం : 22,515 - పూర్తి చేసినవి : 12,500

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా ఉగాది నాటికి గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 22,515 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు లక్ష్యంగా నిర్ణయించింది. ఉగాది పూర్తయినా ఇప్పటి వరకు 12,500 ఇళు మాత్రమే పూర్తికాగా ఇంకా 10 వేల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వీటిని వచ్చే నెల 10వ తేదీనాటికి పూర్తి చేయాలని ఉన్నతాధికారులు జిల్లా అధికారులపై వత్తిడి తెస్తున్నారు.

లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలకు నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా ప్రత్యేక అధికారులు, హౌసింగ్, ఇతర శాఖల మండలస్థాయి అధికారులను గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఒత్తిడి తెస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అనేక సమస్యల వల్ల ఈ లక్ష్యంలో పురోగతి తక్కువగానే ఉంది. లేఅవుట్‌లో లబ్ధిదారుల వారీగా సచివాలయ సిబ్బందిని మ్యాపింగ్, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి తక్కువుగా ఉన్న లే అవుట్లపై ప్రత్యేక అధికారులు మరింతగా శ్రద్ధ తీసుకున్నా పూర్తి చేయలేకపోతున్నారు. సంబంధం లేని శాఖలకు కూడా గృహ నిర్మాణం పూర్తి చేసే బాధ్యతలు అప్పగించి హడావుడి చేస్తున్నారు. అత్యవసర సర్వీసుగా ఉన్న వైద్యారోగ్యశాఖ ఉద్యోగులను కూడా ఇళ్ల నిర్మాణం కోసం పరుగులు పెట్టిస్తున్నారు.

గుంటూరు జిల్లాలో ఉగాది నాటికి 13,341 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఏడు వేల ఇళ్ల వరకు పూర్తయ్యాయి. పల్నాడు జిల్లాలో 9174 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా 5వేల ఇళ్లు పూర్తి చేశారు.గ్రామీణప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి కేంద్ర ప్రభుత్వం రూ.1.59 లక్షలు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేలు ఇస్తుంది. ఉపాధి హామీ కింద 90 రోజుల పని దినాల ద్వారా ఒక్కొక్క పని దినానికి రూ.257 చొప్పున రూ.23,130 సమకూరుతుంది. మరో రూ.12 వేలు స్వచ్ఛభారత్ పథకంలో మరుగుదొడ్డి నిర్మాణానికి కేటాయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.30 వేలు ఈ రూపంలో వస్తాయి. ఇవి కాగా మరో రూ.35 వేలు బ్యాంకు నుంచి స్వయం

▶ 2లో



నిరసన తెలుపుతున్న రైతులు, సంఘాల నాయకులు

చర్చలని పిలిచి మళ్లీ అదేమాట..

- అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం - సమావేశం వెలుపల నిరసన
- బైపాస్ ఎలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్
- భూసేకరణ చేయాల్సి వస్తే చట్ట ప్రకారమే చేయాలన్న రైతులు

ప్రజాశక్తి-నరసరావుపేట

మున్సిపాలిటీ పరిధిలోని కోట్లాది రూపాయల విలువ చేసే భూముల గుండా వేస్తున్న ఎన్‌హెచ్ 167ఎ చీరాల ఓడరేవు నుండి నకరికల్లు వరకు బైపాస్ రోడ్డు ఎలైన్‌మెంట్‌ను మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. తమ భూముల్ని బలవంతంగా సేకరిస్తే పోరాడతామని హెచ్చరించారు. ఇదే అంశంపై ఏడాదికాలంగా రైతులు దశలవారీ పోరాటం చేస్తున్న నేపథ్యంలో 3 నెలల క్రితం రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. దీనిపై రైతులను కలెక్టర్ మంగళవారం చర్చలకు ఆహ్వానించడంతో మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చర్చకు రైతులు మంగళవారం వచ్చారు. గతంలో ఇచ్చిన ఎలైన్‌మెంట్ ఆధారంగానే రోడ్డు నిర్మాణం ఉంటుందని, తమకు సహకరించాలని జెసి ఎ.శ్యాంప్రసాద్, ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు కోరారు. దీనిపై రైతులు ఆగ్రహం

▶ 2లో

ఉపాధి హామీ పనుల్లో అవినీతి

- మా వద్ద పూర్తి ఆధారాలున్నాయి
- ప్రొటోకాల్‌నూ విస్మరిస్తున్న ఉద్యోగులు
- శావల్యాపురం జెడ్‌పిటిసి, కొత్తూరు సర్పంచ్

2 లో

మనబోతు వేటగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల జనరల్ ఫారెస్టు పరిధిలో వన్యప్రాణి వేటగాళ్లను పట్టుకొని వారు వేటాడిన మనుబోతు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్టు రేంజి అధికారి రావు శేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మనుబోతును వేటాడి మాంసాన్ని అమ్ముకుంటున్నారనే సమాచారం మేరకు కండ్లకుంట బీట్ సమీపంలో ఒకర్ని అదుపులోకి తీసుకున్నామని, మనుబోతు పడిందని తెలిసి మాంసం తరలించేందుకు

▶ 2లో



పోలవరం ఎత్తు తగ్గింపు తగదు

వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన, వామపక్షాలు కలిసి పోటీ చేయాలి : సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు ఎత్తుతగ్గింపు ప్రతిపాదనకు నిరసనగా కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో రెండ్రోజుల సామూహిక నిరాహార దీక్ష మంగళవారం ముగిసింది. రెండో రోజు దీక్షలను సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పోలవరం ప్రాజెక్టు విషయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు నిలబెడతారో... చెడగొడతారో చూడాల్సి ఉందన్నారు.. బహుళార్ధక సాధక ప్రాజెక్టుగా నిర్మించాలని రాజశేఖర్‌రెడ్డి పరితపించారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించకుండా ఎత్తు తగ్గిస్తే కేవలం ప్రకాశం బ్యారేజి లాంటి రిజర్వాయర్‌గా మారుతుందన్నారు. రాజకీయంగా బిజెపి, వైసిపి కలిసి పని చేస్తున్నా పోలవరం పూర్తి చేసే విషయంలో రెండు పార్టీలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పోలవరం ఎత్తు తగ్గిస్తే దిగువ ప్రాంతాలకు, పవర్ ప్రాజెక్టులకు, ఉత్తరాంధ్ర, కృష్ణా జిల్లాలకు నీరు అందదని తెలిపారు. పాదయాత్ర, ఎన్నికల సభల్లో సిఎం జగన్ ఇచ్చిన హామీలను విస్మరించారని, అఖిలపక్షం ఆధ్వర్యంలో కేంద్రంపై ఒత్తిడి చేయాలంటుంటే సిఎం జగన్ ఒక్కడే వెళ్లి మోడీ కాళ్లు మొక్కి వస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన, వామపక్షాలు కలిసి పనిచేసి వైసిపి, బిజెపిలను గద్దె దింపాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన సభలో నారాయణ

▶ 2లో



దీక్షల్లో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



ప్రపంచబ్యాంకు బృందానికి స్వాగతం పలుకుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

5 లో

వెనిగండ్ల జెడ్‌పి పాఠశాలను సందర్శించిన వరల్డ్ బ్యాంక్ బృందం

31 వరకే ధాన్యం కొనుగోలు : జెసి

ప్రజాశక్తి-నరసరావుపేట

ధాన్యం కొనుగోలును 31వ తేదీతో నిలిపేస్తామని, ఇంకా తమ ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన రైతులు ఎవరైనా ఉంటే అమ్ముకోవాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా

▶ 2లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం) : 6.25

సహరీ (బుధవారం ఉదయం) : 4.48

ఆర్థిక లబ్ధితోనే వైసిపిలో చేరిన గిరి

కోవెలమూడి రవీంద్ర ఆరోపణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై ఎమ్మెల్యే మద్దాలి గిరి చేసిన వ్యాఖ్యలు సరికాదని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిపి సీటు ఇవ్వకపోతే మద్దాలి గిరి కాణికి పనికిరారని విమర్శించారు. గతంలో ఇతర పార్టీల నుంచి ఎవరు వచ్చినా రాజీనామా చేసి రావాలని చెప్పిన సిఎం జగన్ టిడిపికి చెందిన నల్గురిని యథాతథంగా తీసుకున్నారని అన్నారు. మద్దాలి గిరికి రెండు సార్లు ఎమ్మెల్యే సీటు ఇవ్వగా ఒకసారి ఓడిపోయి మరో సారి గెలిచారని తెలిపారు. గెలిచిన తరువాత వైసిపి వారి వద్ద నుంచి సొమ్ములు తీసుకుని టిడిపికి ద్రోహం చేశారని అన్నారు. అలాగే మద్దాలి గిరికి సంబంధించిన స్పిన్నింగ్ మిల్లుకు రూ.8 కోట్లు విద్యుత్ బకాయిలు రద్దు చేశారని, మిగతా వారికి భారీగా బకాయిలు ఉన్నా రూ.5 కోట్లు మించి ఎవరికి బాకీలు రద్దు చేయలేదన్నారు. ఇంతటి ప్రతిఫలం ఉన్నందునే ఆయన టిడిపి నుంచి వైసిపిలోకి వెళ్లారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దాలి గిరిని ఓటు వేయమని తమ పార్టీ నేతలు ఎవరూ సంప్రదించలేదన్నారు. టిడిపిని అభాసుపాలు చేసేందుకు తమ పార్టీ నేతలు సంప్రదించినట్లు గిరి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఇందుకు ఆధారాలు ఉంటే బయటపెట్టాలన్నారు. మీడియా సమావేశంలో టిడిపి నాయకులు సింగం శెట్టి వీరయ్య, సుఖవాసి శ్రీనివాసరావు, ఈ. వరప్రసాద్ బాబు పాల్గొన్నారు.

గడువు ముగిసినా పూర్తవ్వని లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సహాయక సంఘాల సభ్యులకు రుణం ఇప్పిస్తున్నారు. మొత్తం రూ.2.15 లక్షలతో ఇళ్లుపూర్తి కాని పరిస్థితి నెలకొంది. ప్రతి లబ్ధిదారుడు సొంతంగా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అదనంగా వెచ్చిస్తే తప్ప ఇళ్లు పూర్తి కాని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా నిర్మాణ కూలికి అధికంగా ఖర్చవుతోంది. దీంతో ఆర్థికంగా పరిస్థితి బాగోలేని వారు ఇళ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసుకోలేకపోతున్నారు. గతేడాది కాలంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రాకపోవడం కూడా కొంత మందికి ఇబ్బందిగా మారింది. అలాగే కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి కూడా ఆశించిన పురోగతి లేదు.

చర్చలని పిలిచి మళ్లీ అదేమాట..

(మొదటి పేజీ తరువాయి)

వెలిబుచ్చారు. మున్సిపల్ కార్యాలయం ఎదుటే గాంధీ విగ్రహానికి పూలమాలలేసి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ భూములు తీసుకోవాల్సి వస్తే 2013 భూ సేకరణ చట్టం ప్రకారమే సేకరించాలని, చట్టంలోని అన్ని నిబంధనలనూ పాటించాలని డిమాండ్ చేశారు. రైతులతో గ్రామంలోనే అధికారులు సమావేశం నిర్వహించి, రైతుల అంగీకారంతోనే భూములు సేకరించాలని కోరారు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని కేసానుపల్లి నుండి జొన్నలగడ్డ, గుంటగార్లపాడు, ఇస్సపాలెం, రావిపాడు గ్రామాల రైతుల పొలాల గుండా బైపాస్ వేసి రైతులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. రైతులు ఏడాది కాలం నుండి ఎంపీ, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజా ప్రతినిధులు - బాధిత రైతులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తానని, అప్పటివరకూ సర్వే చేయరని గతంలో కలెక్టర్ ఇచ్చిన హామీ నెరవేరలేదని గుర్తు చేశారు. ఈ రహదారిపై కొద్ది రోజులలో ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం జరుగుతున్నందున రెవెన్యూ అధికారులు హడావుడిగా ఈ సమావేశానికి పిలిచారేమోనని సందేహాన్ని వెలిబుచ్చారు. నిరసనలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు, పిడిఎం నాయకులు ఎన్.రామారావు, ఆయా గ్రామాలకు చెందిన 150 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే టిడిపి ధ్యేయం: యనమల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పేదల సంక్షేమమే ధ్యేయంగా టిడిపి ఆవిర్భవించిందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యనమల రామకృష్ణుడు పాల్గొన్నారు. జిల్లా అంగన్వాడీ డ్వాక్రా సాధికార కమిటీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రామకష్టుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రజల కోసం చేసిన సేవలను స్మరించుకుని ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని అన్నారు. సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో ప్రజా సంక్షేమ పాలనకు బాటలు వేసి భారత రాజకీయ చరిత్రలో సంక్షేమ అధ్యయనానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల లోనే ముఖ్యమంత్రిగా అధి . కారంలోకి వచ్చిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని ప్రశంసించారు. మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు, పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి కోవెల మూడి రవీం ద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస రావు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్య దర్శులు ఎం.మోహన్‌కృష్ణ, ఎం. ఇమ్మానుయేల్, నగర పార్టీ అధ్యక్షుడు డేగల ప్రభాకర్,కె.శివరామయ్య, బి. వందనాదేవి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నం

తమ భూమి విషయంలో న్యాయం కోసం గడ్డిమందు తాగిన మహిళ

ప్రజాశక్తి -అచ్చంపేట



భూమి విషయంలో తాము తీవ్రంగా అన్యాయానికి గురవుతున్నామని, తమకు తెలియకుండానే తమ భూమిని ఎవరో అమ్మకోగా, మరెవరో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని దంపతులు వాపోతున్నారు. ఈ అంశంపై న్యాయం కోసం మహిళ తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిపై బాధితురాలి భర్త శ్రీనివాసరెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని కోగంటివారిపాలేనికి చెందిన పల్లబ్రోలు శ్రీనివాసరావు, సంపూర్ణమ్మ దంపతులకు పిల్లలెవరూ లేరు. వీరిద్దరే వ్యవసాయ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. వీరికి చామర్రు రెవెన్యూ పరిధిలో రెండెకరాల పొలం ఉంది. ఈ భూమిని వీరి బంధువులైన దమ్మాలపాటి శ్రీనివాసరెడ్డి, అంకిరెడ్డి కోటిరెడ్డి, శివారెడ్డి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దాన్ని స్వాధీనం చేసుకునేందుకు వారు యత్నిస్తుండగా ఏడాది ఆరు నెలల కిందట ఈ సమాచారం తెలుసుకున్న దంపతులు కోర్టును ఆశ్రయించారు. దీంతోపాటు కొద్దినెలల కిందట గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు చేసి తమ భూమిని కాజేయాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే అధికారులు సరిగా పట్టించుకోవడం లేదంటూ సంపూర్ణమ్మ మంగళవారం అచ్చంపేటలోని తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి గడ్డి మందు తాగారు. ఇది గమనించిన స్థానికులు ఆమెను సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు.

మెరుగుపడని ఇసుక సరఫరా

- ప్రజల సొమ్ముతో జరిమానాల చెల్లింపులు తగదు
- కన్నా లక్ష్మీనారాయణ విమర్శలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చి నాలు గేళ్లయినా ఇసుక సరఫరా మెరుగుపడలేదని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. గుంటూరులోని తన నివాసంలో మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే అతి తక్కువ ధరకు ఇసుక సరఫరా చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన జగన్ ఇప్పుడు నాలుగు రెట్లు ధర పెంచి విక్రయిస్తున్నారని విమర్శించారు. పర్యా వరణ నిబంధనలను ఉల్లఘిస్తున్న నేపథ్యంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చిత్తూరు జిల్లాలోని 18 రీచ్‌లకు రూ.18 కోట్ల జరిమానా విధించిందని, ప్రభుత్వ పెద్దలు, కాంట్రాక్టర్లు చేసే తప్పులకు ప్రజల సొమ్ముతో జరిమానాలు ఎలా చెల్లిస్తారా అని ప్రశ్నించారు. జగన్ తన స్వంత డబ్బును గ్రీన్ ట్రిబ్యునల్‌కు చెల్లించాలన్నారు. మోస పూరిత హామీలు ఇచ్చి జగన్ అధికారంలోకి వచ్చాడని ఇందుకు నిదర్శనంగా నాలు గేళ్లుగా అమలు అవుతున్న ఇసుక పాలసీ కూడా ఒకటన్నారు. జగన్ ఇసుక విధానం వల్ల రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. తొలుత ఆరు నెలలు ఇసుక నిలుపుదల చేసి కార్మికుల పొట్టగొట్టాడని, ఇసుక ఆదాయం అంతా తనకే రావాలనే దురాశ పేదలను పస్తులుండేలా చేసిందని విమర్శించారు. వందల కొద్ది లారీల ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని, ఒక్కో జిల్లాకు ఒక్కో కాంట్రాక్టరును నియమించారని ఆరోపించారు. ఒక కలెక్టర్ రెండు లారీల ఇసుక తెచ్చుకోలేని దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. రాష్ట్రంలోని నదులన్నీ ప్రమాదంలో పడ్డాయని, నదీ గర్భంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వుతున్నారని, అమరావతి మండలం ముత్తాయపాలెంలో నది మధ్యలో రోడ్డు వేశారని అన్నారు. ముత్తాయా పాలెంలో ఇసుక రీచ్‌కు అసలు ప్రభుత్వ అనుమతి లేదన్నారు.

మనబోతు వేటగాళ్లు అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సహాయంగా మరో ఇద్దర్ని అదుపులోకి తీసుకొని మాంసాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మాచర్ల మండలం కొప్పునూరుకు చెందిన శీలం కొండ వ్యవసాయ పనులలో కాపాల పనులు చేస్తుంటాడని, వ్యవసాయ భూమిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుండి విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం వలన మనుబోతు విద్యుత్ షాక్ తగిలి చనిపోయిందని తెలిపారు. జింక, దుప్పి జాతికి చెందిన మనబోతులు ఈ ప్రాంతంలో అధికంగా ఉంటాయని తెలిపారు. ఇవి 60-100 కిలోలకుపైగా ఉంటాయని, వీటి వేట నేరమని చెప్పారు. దీనిపై పూర్తి విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామన్నారు. శీలం కొండతో పాటు, బాణావత్ సాయి, రంగాను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతి

- మా వద్ద పూర్తి ఆధారాలున్నాయి
- ప్రొటోకాల్‌నూ విస్మరిస్తున్న ఉద్యోగులు
- శావల్యాపురం జెడ్‌పిటిసి, కొత్తూరు సర్పంచ్

ప్రజాశక్తి - వినుకొండ

ఉపాధి హామీ అధికారులు, ఉద్యోగులు ప్రొటోకాల్ పాటించడం లేదని జెడ్‌పిటిసి పారా హైమావతి, కొత్తపల్లి సర్పంచ్ గుంటూరు నాగమల్లీశ్వరి అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిమిత్తం శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయానికి మంగళవారం వచ్చిన పీడీని జెడ్‌పిటిసి, సర్పంచ్ కలిసి లికిత పూర్వక ఫిర్యాదును అందించారు. పంచాయతీ తీర్మానం లేకుండా, సర్పంచ్‌కు సమాచారం, ఆహ్వానం ఇవ్వకుండానే కొత్తలూరు గ్రామ సభ సోమవారం నిర్వహించారని, ఇది చట్ట విరుద్ధమని చెప్పారు. ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించే ప్రజా వేదిక అంశంలోనూ ప్రొటోకాల్‌ను ఉల్లంఘించారని, తనకు అధికారికంగా ఆహ్వానం అందించలేదని సర్పంచ్ నాగమల్లీశ్వరి చెప్పారు. ఈ మేరకు సమావేశాన్ని వాకౌట్‌చేసి వెళ్లారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వైసిపి నేతల కనుసనల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్నారని, ఇప్పటి వరకు చేసిన అన్ని పనుల్లోనూ అవకతవకలు ఉన్నాయని ఆరోపించారు. గ్రామాల్లో లేనివారికి హాజరు వేసి డబ్బులను తీసుకుంటున్నారని విమర్శించారు. ఉపాధి హామీ పనులపై సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగినా అధికారులు ఇవ్వడం లేదని, అవకతవకలపై తమ వద్ద అధారాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుంటూరు సాంబశివరావు, టిడిపి నాయకులు జి.మస్తాన్‌రావు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

31 వరకే ధాన్యం కొనుగోలు : జెసి

(మొదటి పేజీ తరువాయి)

సేకరించడం అధికభాగం పూర్తయిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 32 రైతు భరోసా కేంద్రాల ద్వారా 361 మంది రైతుల వద్ద 2275.680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు కనుగుణంగా ప్రస్తుతం ఖరీఫ్ పంట కాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశామని, మిగిలిన ధాన్యాన్ని కూడా రైతులు మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో త్వరగా అమ్ముకోవాలని కోరారు.

పోలవరం ఎత్తు తగ్గింపు తగదు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ విభజన హామీల్లో పోలవరం కీలకమైందని అన్నారు. ఎత్తు తగ్గించడం వల్ల ఈ ప్రాజెక్టు ప్రయోజనం నెరవేరదని అన్నారు. దీక్షలకు పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకశ్వరరావు, నగర కార్యదర్శి మాల్యాద్రి, పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపి పాల్గొన్నారు.



ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని స్టేషన్ రోడ్డులో రెండోరోజు దీక్షలను సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, ప్రముఖ వైద్యులు కొండపల్లి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, నాయకులు ఆంజనేయ నాయక్, శివకుమారి, ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు కొల్లి బ్రహ్మయ్య దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు కె.రాంబాబు, బి.శ్రీనివాసరావు, వి.వెంకట్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలో పేదలందరికీ ఇళ్ళ పథకం లే అవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలకు నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా ప్రత్యేక అధికారులు, హౌసింగ్, ఇతర శాఖల మండలస్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు ప్రతి పదిహేను రోజులకు నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. లేఅవుట్‌లో లబ్ధిదారుల వారీగా సచివాలయ సిబ్బందిని మ్యాపింగ్, ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఇళ్ళ నిర్మాణాల పురోగతి తక్కువుగా ఉన్న లే అవుట్లపై ప్రత్యేక అధికారులు మరింతగా శ్రద్ధ తీసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థానికంగా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కారదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు అనుగుణంగా అవసరమైన నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. లే అవుట్ లో మౌలిక సౌకర్యాల అభివద్ధి పనులు, అప్రోచ్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం. వెంకట శివరామిరెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో మోహనరావు, హౌసింగ్ పీడీ సాయినాధ కుమారు, పంచాయితీరాజ్ ఎస్ ఈ బ్రహ్మయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

COURT NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL.JUNIOR CIVIL JUDGE::TENALI
O.S.No:705 / 2022

Between:
Maddi Malleswari .....Plaintiff
AND
Kodela Srinivasa Rao and 3 Others ...... Defendants

To,
D-2: Nakkaboina Venu Babu, S/o.Anjaneyulu, aged about 45 years , Hindu, Cultivation,
D-3: Kanneganti Subbaiah, S/o. Venkateswara Rao, Aged about 55 years, Hindu, Cultivation, Cenima Hall Bazar, Both are R/o.Eemani Village, Duggirala Mandal, Guntur Dist.

పై నెంబరు దావాలో 2 &3 వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా,సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:06-04-2023 న ఉదయం గం. 10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:06-04-2023

పి.రవీంద్ర బాబు,
కె.శ్రీనివాసరావు,
సిహెచ్.శారద,
వాది తరపు అడ్వకేట్స్, తెనాలి,
గుంటూరు జిల్లా.
సెల్: 98483 56442, 9491115530

COURT NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL.JUNIOR CIVIL JUDGE::TENALI
I.A.NO:1061/2022 IN O.S.NO:705 / 2022

Between:
Maddi Malleswari .....Petitioner/ Plaintiff
AND
Kodela Srinivasa Rao and 3 Others ...Respondents/Defendants

To,
R-2/D-2: Nakkaboina Venu Babu, S/o.Anjaneyulu, aged about 45 years, Hindu, Cultivation,
R-3/D-3: Kanneganti Subbaiah, S/o. Venkateswara Rao, Aged about 55 years, Hindu, Cultivation, Cenima Hall Bazar, Both are R/o.Eemani Village, Duggirala Mandal, Guntur Dist.

పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం:1061/2022 పిటీషనులో 2 & 3వ రెస్పాండెంట్స్/ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియ పరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:06-04-2023 న ఉదయం గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియ పర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:06-04-2023

పి.రవీంద్ర బాబు,
కె.శ్రీనివాసరావు,
సిహెచ్.శారద,
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్స్,
తెనాలి, గుంటూరు జిల్లా.
సెల్: 98483 56442, 9491115530

మండల ప్రజా పరిషత్ కార్యాలయం - తుళ్లూరు
వేలం ప్రకటన

మండల ప్రజా పరిషత్, తుళ్లూరు మండల పరిధి నందలి తాళ్ళాయపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందలి రెండు క్లాస్ రూం లు,మరియు వరండా శిథిలావస్థకు చేరి యున్నందున వాటిని తొలగించి,దాని తాలూకు వచ్చిన మెటీరియల్ ను వెనుక ఖాళీ స్థలం నందు పోయ వలచినదిగా,ఆక్షన్ మందడం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి,గ్రామ పంచాయతీ కార్యదర్శి,మండల విద్యా శాఖాధికారి మరియు మండల అసిస్టెంట్ ఇంజినీర్ వారి అధ్యక్షతన 31 - 3 - 2023 ఉదయం 10 గంటలకు నిర్వహించ బడును.కావున ఆక్షన్ లో పాల్గొన్న దలచినవారు ముందుగా రూ 3,000లను మండల ప్రజా పరిషత్ సాధారణ నిధులకు చలానా ద్వారా చెల్లించి వేలం పాటలో పాల్గొన వలచినదిగా కోరడమైనది.

ఎ శ్రీనివాసరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్, తుళ్లూరు

గ్రామ పంచాయితీ కార్యాలయము, పెదపరిమి
టెండరు ప్రకటన

తేది: 28-3-2023

గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం, మందడం గ్రామ పంచాయితీకి 2023-24 సం.మునకు గాను ఈ దిగువ తెల్పిన షెడ్యూల్లో చూపిన సామానులు సరఫరా చేయుటకు / మనుషుల సర్వీసు కొరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయితీ కార్యాలయంలో కార్యదర్శి గారిచే లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని ది. 31-03-2023వ తేదీ మధ్యాహ్నం గం॥ 3,00ల వరకు స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.30 ని॥ లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూల్లో తెలిపిన ధరావత్తు చెల్లించిన రశీదును జత పరచి టెండరు దాఖలు చేయవలెను.ధరావత్తు చెల్లించని టెండర్లు తిరస్కరించబడును. ఏ కారణము తెలుపకయే టెండర్లు వాయిదా వేయుటకు లేదా మార్పులు చేయుటకు కార్యదర్శిగారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములకు కార్యాలయం పనివేళల యందు సంప్రదించవచ్చును.

షెడ్యూలు

వ. నెం.	వివరములు	టెండరు ధరావత్తు
01.	2023-24 సం॥నకు గ్రామ పంచాయితీకి అవసరమగు ప్రజారోగ్య సామానులు సరఫరా చేయుట టెండరు ధరావతు	రూ.200-00
02.	2023-24 సం॥నకు గ్రామ పంచాయితీకి అవసరమగు పిడబ్ల్యుఎస్ సామానులు సరఫరా చేయుట	రూ.200-00
03.	2023-24 సం॥నకు గ్రామ పంచాయితీకి అవసరమగు ఎలక్ట్రికల్ సామానులు సరఫరా చేయుట	రూ.200-00
04.	2023-24 సం॥నకు గ్రామ పంచాయితీకి అవసరమగు స్టేషనరీ సామానులు సరఫరా చేయుట	రూ.100-00
05.	2023-24 సం॥నకు గ్రామ పంచాయితీ లో టెండరు పద్ధతిపై పని చేయుటకు పోస్టులు -19 1) స్వీపర్లు - 9 2)స్వీపర్ (కం) డ్రైన్ క్లీనర్ పోస్టులు-5 3) మోటర్ ఆపరేటర్ 1 4) పైఫ్ లైన్ ఫిట్టర్ 1 5) ఎలక్ట్రీషియన్ పోస్ట్ -1 6) ట్యాంక్ వాచర్ 1 7) ట్రాక్టర్ డ్రైవర్ 1	ఒక్కొక్క పోస్టు కి రూ.50-00

(సం॥) డి.శేఖర్,
పంచాయితీ కార్యదర్శి,
గ్రామ పంచాయితీ, పెదపరిమి

ఉండవల్లి శ్రీదేవిపై అనుచిత వ్యాఖ్యలకు వైసిపి దళిత నేతల ఖండన

ప్రజాశక్తి-మంగళగిరి

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రకటన వెలువడిన క్రమంలో దళిత సామాజిక వర్గానికి చెందిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ని అధిష్టానం పార్టీ నుండి సస్పెన్షన్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఆమెపై వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ దళిత నేతలు అన్నారు. ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపికి కాకుండా తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి ఉంటే తాము ఖండిస్తున్నామన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే శ్రీదేవి పై అనుచిత వ్యక్తులు చేసి ఆమె వ్యక్తిత్వాన్ని క్యారెక్టర్ ను దానితోపాటు కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు చేయడం తగదని, మీడియాలో ఎమ్మెల్యే శ్రీదేవి పై చేసిన వైయస్ఆర్సీపీ అధిష్టానం స్పందించాలన్నారు. మాదిగల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని, దీనిని వేరే విధంగా భావించకుండా మాదిగల మనోభావాలకు విలువ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఇప్పటికైనా పార్టీపై, అధిష్టానంపై విమర్శలు చేయకుండా పరిపాలన యధావిధిగా కొనసాగించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మహిళలంటే ఎంతో గౌరవం ఇస్తుందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు పెడతామని, అవసరమైతే న్యాయపోరాటం కూడా చేసేందుకు సిద్ధమన్నారు. సమావేశంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి పచ్చల శ్యామ్ బాబు, కార్యదర్శి ఈపూరి ఆదాం, వైఎస్ఆర్సిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఈ పూరి రవి, ఆంధ్రప్రదేశ్ మాదిగ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ కొదమల కుమార్, ఎంఎసిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతపూడి సాంబయ్య, సి ఎస్ టి అట్రాసిటీ యాక్ట్ అధ్యక్షుడు పులి దాసు, వైఎస్సార్ సీపీ నాయకులు పులివర్తి రాంబాబు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు గుంటూరుజిల్లా, తాడేపల్లి మండలం, తాడేపల్లి గ్రామము వాస్తవ్యురాలు డోర్ నెం. 12-402/3, గోవర్ధనగిరి నగర్, కీర్తి ఎస్టేట్స్, కాపురస్తురాలు కొండపావులూరి కీర్తి స్వరూపరాణి భర్త మోహన్ కుమార్ గారి యొక్క సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా :

నా క్లయింటు ది. 06-06-1983 తేదీన నా క్లయింటు మైనర్‌గా వున్నారు. నా క్లయింటు తండ్రి గారు నా క్లయింటుకు గార్డియన్‌గా వుండి నా క్లయింటు పేరుతో నా క్లయింటు తండ్రిగారు అయిన లేటు కొల్లి గోవర్ధనరావుగారు లోగడ కృష్ణాజిల్లా ప్రస్తుతం యన్.టి.ఆర్.జిల్లా, విద్యాధరపురం కాపురస్తులు అయిన మైనంపాటి పెద బసవయ్యగారి కుమారుడు మైనంపాటి వెంకటయ్య వలన ఈ దిగువ షెడ్యూలు గల భూమిని శ్రీ మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో దస్తావేజు నెం. 3182/1983గా నా క్లయింటు పేరుతో రిజిస్ట్రేషన్ చేయించిన రీత్యా తద్వారా నా క్లయింటుకు సంక్రమించిన భూమిని నాటి నుండి నేటివరకు నా క్లయింటు స్వాధీన సర్వ సంపూర్ణ హక్కు భుక్తములలో వుండియున్నది. నా క్లయింటు తండ్రిగారు లేటు కొల్లి గోవర్ధనరావుగారు మరియు నా క్లయింటు తల్లి కొల్లి ఏటు సాంబ్రాజ్యమ్మగారు పరమపదించియున్నారు. నా క్లయింటు తల్లిదండ్రులకు ఏకైక సంతానముగా కల్గియున్నారు. వేరేవ ఆరసులు ఎవ్వరు లేరు. గుంటూరుజిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ యిలాకా తాడేపల్లి పంచాయతీ ఏరియాలో చేరిన తాడేపల్లి గ్రామములో వున్నట్టి డి.నెం.57/ఏరు, య.0-15 1/6 ట్లు లేక హె.0.06 రు. మెరక భూమికి నీటి హక్కులు, ఉజ్జీ కాలువ హక్కులు యావత్తు ఈజ్‌మెంట్ హక్కులతో సహా ఈ భూమికి నాటి నుండి నేటి వరకు నా క్లయింటు స్వాధీనంలో వుండియున్నది. ఈ భూమికి సంబంధించిన యావత్తు లావాదేవీలన్నియు నా క్లయింటు యందు మాత్రమే ఉన్నవి. ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని డిజిటలైజేషన్ చేయించు కొనుటకు ఎవరికైనా అభ్యంతరములు కాని, ఆక్షేపణలు గాని, కోర్టు ఎటాచ్‌మెంట్లు వగైరా ఉన్నయెడల ఈ ప్రకటన తేదీన లగాయత్తు ఏడు రోజులలోగా మాకు లిఖిత పూర్వకంగా తెలియపర్చవలెను. తదుపరి వచ్చు ఆక్షేపణలు, అభ్యంతరములు నా క్లయింటున మరియు షెడ్యూలు ఆస్తిని యే విధముగనైనను బైండ్ చేయజాలవని ముందుగా తెలియజేయటమైనది.

షెడ్యూలు ఆస్తికి హద్దులు :
తూర్పు : కొల్లి సుశీల భూమి దక్షిణం : డొంక
పడమర : కోనేరు కృష్ణమూర్తి గారి భూమి,
ఉత్తరం : కొల్లి సాంబ్రాజ్యమ్మగారి భూమి
ఈ హద్దుల మధ్య య. 0.15 శెంట్లు

బి.నాయుడమ్మ,
యన్.కోటేశ్వరరావు,
అడ్వకేట్స్,
మంగళగిరి.
సెల్ : 9394322229



కిలోన్నర గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- మంగళగిరిరూరల్

మంగళగిరి మండలం పెదవడ్లపూడి హిందుస్మశాన వాటికలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబి సిఐ మారయ్య బాబు తెలిపారు. సమాచారం మేరకు నిఘా ఏర్పాటు వలపన్ని ముగ్గురూ యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. నిందితులు పెదవడ్లపూడి, భగత్ సింగ్ నగర్, బాప్టిస్ట్ పేటలకు చెందిన వారు దిలీప్ వెంకట నాగార్జున పెదవడ్లపూడి, వై గణేష్ భగత్ సింగ్ నగర్, బి రవీ మంగళగిరి బాప్టిస్ట్ పేటకు చెందిన వారుగా గుర్తించారు. ఈ దాడులలో ఎస్సై మల్లిఖార్జున్, హెడ్ కానిస్టేబుల్ పద్మజా, పిసిలు ఎ శ్రీనివాసరావు, రమేష్, హనుమంతు, రజని తదితరులు పాల్గొన్నారు. ఆ సాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఈబి సిఐ మారయ్య బాబు హెచ్చరించారు.

ప్లాట్‌ఫారంపై గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-తెనాలి:

స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిఆర్పీ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం మృతుని వయసు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై తెల్ల పంచె, నీలం రంగు నిండు చేతుల చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

IN THE COURT OF THE MOTOR VEHICLE ACCIDENT TRIBUNAL CUM XXVI Addl. CHIEF JUDGE CITY CIVIL COURT, AT; HYDERABAD

OP No. 39 OF 2020

BETWEEN;
V. Sujatha and others ...Petitioner.
AND
Bathula Guruvaiah and another ...Respondents

NOTICE

To,
R1
A. Sudheer, S/o. Krishna, Aged: Major, Occ: Driver, R/o. H.No.14-9-38, Netajinagar, Nidubrolu, Ponuru, Guntur District-522124. Andhra Pradesh State

Please take Notice that the above petitioner filed claim Petition against you and the respondent No 2, several times notices were issued to you through court and R.P but you have failed to receive the same, the case is posted on **24/04/2023** for your appearance on that day you have to appear in person or with your counsel at 10.30 A.M before the Hon'ble court, Otherwise case will be decided against you

(BY ORDER OF THIS HON'BLE COURT)

LR. PRAKASH
K. RANJITH KUMAR
ADVOCATES
H.No.10-244/15, Vasanthpuri Colony, Malkajgiri, Secunderabad.
Cell: 9866611022

ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై పట్టణ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం సుల్తానాబాద్‌కు చెందిన సాలినాబాయి(80) స్థానిక మార్కెట్ యార్డు వద్ద నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి ఆటో ఢీకొంది. ఘటనలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతేదహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలు సీజ్

ప్రజాశక్తి-తెనాలి

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక లారీలను ఎస్ఈబి అధికారులు సీజ్ చేశారు. సిఐ ఏవి చలం నేతృత్వంలో మంగళవారం వాహనాల తనిఖీలునిర్వహించారు. కొల్లిపర నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. డ్రైవర్లపై కేసులు నమోదు చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

ప్రభుత్వ ఉద్యోగులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా ఆవిర్భవించి 4వ తేదీ నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. ఈ మేరకు క్రికెట్‌లో కలెక్టర్ ట్రోఫీ పోటీల పోస్టర్‌ను కలెక్టర్ బంగళాలో మంగళవారం ఆవిష్కరించారు. క్రికెట్ విభాగంలో పోటీలకు డ్వామ పీడీ జోసఫ్ కుమార్ ప్రాతినిధ్యం వహించనుండగా జనరల్ పబ్లిక్ యువత నుంచి చీఫ్‌కోచ్ శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహించనున్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌కు డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, చెస్‌కు ఆరోగ్యశ్రీకి చెందిన డాక్టర్ పి.సునీల, తోబాల్‌కు సివిల్ సప్లయిస్ డీఎం జి.వరలక్ష్మి, క్విజ్‌కు జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, సంగీతం జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళి, సింగింగ్ కాంపిటీషన్‌కు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఓబుల్ నాయుడు, ఫన్ గేమ్స్ సంబంధించి జిల్లా సెరికల్చర్ ఆఫీసర్ పి.రాధారాణి ప్రాతినిధ్యం వహించనున్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో రాజకుమారి

డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా ఏర్పడి ఏడాదైన సందర్భంగా కలెక్టర్స్ ట్రోఫీ క్రికెట్ పోటీల్లో భాగంగా ఉద్యోగులకు సత్తెనపల్లి డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం నిర్వహించారు. సత్తెనపల్లి శరభయ్య హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న పోటీలకు డివిజన్‌లోని వివిధ మండలాల నుండి 10 జట్లు హాజరయ్యాయి. పోటీలను ప్రారంభించిన ఆర్డీవో బిఎల్ఎన్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాస్థాయిలోనూ ప్రతిభ చూపి ట్రోఫీని సాధించాలని ఆకాంక్షించారు. తహసిల్దార్ కె.నగేష్ ఎంపిడిఒ జీవి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.షమీ. వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

చౌక్‌బాల్ రాష్ట్ర చైర్మన్‌గా చేబ్రోలు మహేష్

ప్రజాశక్తి-చిలకలూరిపేట



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చౌక్‌బాల్ చైర్మన్‌గా స్థానిక మోడరన్ విద్యా సంస్థల అధినేత చేబ్రోలు మహేష్ నియమితులైనట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.సుధాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు మోడరన్ విద్యాసంస్థల కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. చైర్మన్‌గా మహేష్ నాలుగేళ్లపాటు కొనసాగుతారని తెలిపారు. ఈ ఎంపికపై పల్నాడు జిల్లా అధ్యక్షులు చుండి విజయసారధి, సెక్రటరీ వై.ఫిలిప్‌రాజు, ట్రెజరర్ ఉసా సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్, శ్యామ్యూల్, పిఇటి పొదిలి వెంకటేశ్వర్లు, మనోహర్, అమీర్ హుస్సేన్, శబరి, లక్ష్మీప్రసన్న అభినందనలు తెలిపారు.

తెల్లబోతున్న పత్తి రైతులు

- ధర కోసం నిరీక్షణ
- దిగుబడిని దెబ్బతీసిన తెగుళ్లు, తుపానులు
- రేటు చెబుతున్నా కొనుగోలుకు ముందుకురాని వ్యాపారులు
- ఇప్పుడున్న ధరైతే నిండా మునుగుతామని రైతుల ఆవేదన



మొక్కలకు నాణ్యమైన పత్తి లేకపోవడతో మేకలు మేయడానికి అమ్ముకున్న పైరు



నిల్వ ఉంచిన పత్తిని చూపుతున్న రైతు కిషోర్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట ప్రాంతంలో దారుణంగా పడిపోయిన పత్తిధరలతో రైతులు చిత్తవుతున్నారు. తొలుత ప్రభుత్వం ప్రకటించిన రూ.6350 మద్దతు ధరకంటే ఎక్కువగానే బహిరంగ మార్కెట్‌లో ధర ఉన్నా ప్రస్తుతం వ్యాపారులు ధరను దిగ్గోసి తమను దగా చేస్తున్నారని ఆవేదనకు గురవుతున్నారు. పత్తిపంట దిగుబడి వచ్చిన తొలి రెండుమూడు తీతల్లో క్వింటాళ్ రూ.8 వేల నుండి రూ.8500 వరకు ఉంది. ప్రస్తుతం నాణ్యమైన పత్తిని కూడా రూ.6,000-7,000కు వ్యాపారులు అడుగుతున్నారు. ఈ ధరలైతే తమకు కనీసం పెట్టుబడులైనా రాక అప్పుల పాలవుతామని రైతులు చెబుతున్నారు.

మంచి ధర కోసం చూస్తున్నా..

పాతికేళ్ల నుండి పత్తిపంట సాగు చేస్తున్నా. గతంలో నా సొంతపొలం 15 ఎకరాలతోపాటు మరో 35 ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం 50 ఎకరాలు సాగు చేసేవాడిని. దిగుబడులు, ధరలు తగ్గిపోతుండడంతో సాగు చేయడం తగ్గించా. ఈ ఏడాది నా సొంతపొలం వరకే వేస్తున్నా. తెగుళ్లు, ఇతర ఉపద్రవాల వల్ల దిగుబడి 80 క్వింటాళ్లలోపే వచ్చింది. ఇందులో 9 క్వింటాళ్లకుపైగా గుడ్డిపత్తి ఉంది. పొలంలో మిగిలిన పత్తి కూడా సరైంది కాకపోవడంతో మేకలను మేపే వారికి పైరును అమ్మేశా. పంటను అమ్ముకుందామంటే సరైన ధరలేదు. రైతులను ప్రభుత్వం ఆదుకోకుంటే నష్టాల నుండి కోలుకోలేము.

బుల్లిబాబు, రైతు, చిలకలూరిపేట.

చిలకలూరిపేట పట్టణం, మండల పరిధిలో 32,500 ఎకరాల సాగు భూమి ఉండగా ఈ ఏడాది 7500 ఎకరాల్లో పత్తి సాగైంది. పత్తిసాగుకు కోసం ఎకరాకు పెట్టుబడి రూ.25-30 వేల వరకూ అయ్యింది. దీనికి కౌలు మరో రూ.9-12 వేలు అదనం. సాధారణంగా ఎకరాకు దిగుబడి 12 క్వింటాళ్లు వస్తుంది. అయితే ఈ ఏడాది ప్రారంభంలోనే తెగుళ్ల దాడి మొదలైంది. విత్తనాలు మేలైనవి దొరక్కపోవడం, గులాబి రంగు పురుగు, తెల్లదోమ, పచ్చదోమ ఉధృతి, తుపాన్లు తదితర కారణాలతో దిగబడి సగానికిపైగా పడిపోయింది. ఎకరాకు గరిష్టంగా 6 క్వింటాళ్లు, కనిష్టంగా 4 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. ఇందులోనూ అర క్వింటాళ్‌కు పైగా గుడ్డి పత్తి ఉంటోంది. ఈ గుడ్డిపత్తిని అమ్ముకోవాలంటే అసలు ధరలో 60 శాతం వరకూ తక్కువకు వ్యాపారులు కొంటారు.

తొలి రెండు మూడు తీతల్లో క్విటాన్నరకు పైగా పంట చేతికి రాగా ఆ సందర్భంలో ధర క్వింటాళ్ రూ.8500 వరకూ ఉండడంతో సిపిఐ పత్తి కొనుగోలు కేంద్రాల అవసరం లేకపోయింది. ప్రస్తుతం ధరలు తగ్గిన నేపథ్యంలో రైతులు అయోమయంలో ఉన్నారు. దాదాపు 35-45 శాతం పంట ఇప్పటికీ రైతుల వద్దే ఉంది. తాము పెట్టిన పెట్టుబడికి క్వింటాళ్ పత్తి రూ.9 వేలకు పైగా అయితే అప్పుల నుండి బయటపడతామని, కానీ ఇప్పుడు ధరలు తగ్గడం ఒకెత్తయితే ఆ ధరలకు కూడా వ్యాపారులు సరిగా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. బాగా నాణ్యమైన పత్తి, ఎక్కువ మొత్తంలో ఉంటేనే కొంటున్నారని, సెకండ్ క్వాలిటీ అయితే రూ.5,500కు అడుగుతున్నారని రైతులు చెబుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు, రైతు సంఘాల నాయకులు

5న కార్మికుల, కర్షకుల చలోఢిల్లీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ 5వ తేదీన నిర్వహించే చలోఢిల్లీని జయప్రదం చేయాలని వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను స్థానిక మాచర్ల బస్టాండ్ సెంటర్లో రైతు, కార్మిక సంఘాలు మంగళవారం ఆవిష్కరించాయి. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లుగా అనుసరిస్తున్న విధానాలతో కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని, రైతులు అప్పుల పాలయ్యారని చెప్పారు. పంటలకు మద్దతు ధరల్లేక దీనస్థితిలో ఉన్న రైతులను ఆదుకోవడం విస్మరించి వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి పూనుకున్నారని విమర్శించారు. ఉపాధి హామీకి నిధులు తగ్గిస్తున్నారని, కూలీలు పని చేయలేని విధంగా నిబంధనలు తెస్తున్నారని చెప్పారు. బ్రిటీష్ నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను హరిస్తున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పరిరక్షణ, మద్దతు ధరల చట్టం, కౌలురైతులకు రుణ సదుపాయం, పటిష్టంగా ఉపాధి హామీచట్టం అమలు, పనిదినాలు, కూలిరేట్ల పెంపు, కార్మికులు కనీస వేతనం రూ.26 వేలు, ఉద్యోగ భద్రత, పింఛను తదితర సమస్యల పరిష్కారం కోసం చలోఢిల్లీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి రైతులు, కౌలురైతులు, కూలీలు, సంఘటితరంగ కార్మికులు, అన్ని రంగాల ప్రజలూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, కాటమరాజు, డి.వెంకటేశ్వర్లు, పాపారావు, కొండలు, ఏసుబాబు, నాగేశ్వరరావు, శివ పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఏళ్ల తరబడి పని చేస్తున్న ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్లు అందించాలని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.హనుమంతరెడ్డి, ఎస్.ఆంజనేయ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఒ ప్రకటన జారీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో కీలకపాత్ర ఆరోగ్య మిత్రలదేనని, నెట్‌వర్క్ ఆస్పత్రులకు, రోగులకు అనుసంధానంగా వ్యవహరిస్తూ విశేషమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. పల్నాడు జిల్లాలో 80 మందికి పైగా ఉన్న ఆరోగ్య మిత్రలు చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా రూ.15 వేల వేతనం మాత్రమే ఇస్తున్నారని, కటింగులు రూ.2 వేలు పోను చేతికి రూ.13 వేలు మాత్రమే వస్తోందని, ఉద్యోగ భద్రతా లేదని వివరించారు. పెరిగిన ధరలతో వీరికొచ్చే జీతం చాలక అస్తుబిస్తుగా కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలను పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు, వైద్యారోగ్యశాఖ నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలని, అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఆరోగ్య మిత్రల సమస్యలపై శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాట్లాడారని, ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేకుంటే సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

ఆటో, ఇతర రవాణారంగ కార్మికులపై పెను భారాలు మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. చలో ఢిల్లీకి సంఘీభావంగా ఈనెల 31న సాయంత్రం 4 గంటలకు గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే సభలో ఆటో డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మంగళవారం స్థానిక హిందూ కాలేజి సెంటర్‌లోని ఆటో స్టాండ్ వద్ద ఛలో ఢిల్లీ పోస్టర్‌ను ఆటో డ్రైవర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జి.శంకర్రావు, నగర నాయకులు వేముల శ్రీను, ఖాశీం, బాజి, శ్రీనివాస రెడ్డి, తిరుపతి రెడ్డి, సాంబయ్య, భాస్కరరెడ్డి, చోటు, కారసాల శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ తాడికొండ మండలంలోని బడేపురం,నిడుముక్కల, మోతడక,లచ్చన్న గుడిపూడి, పొన్నెకల్లు తదితర గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కనగాల పూర్ణచంద్రరావు, మండల రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, కౌలు రైతు సంఘం నాయకులు బాణావత్ భద్రయ్య, రైతులు రైతు కూలీలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్ : చలో ఢిల్లీ కార్యక్రమంలో రైతులు కార్మికులు కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని కోరుతూ సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నీరుకొండ, కురగల్లు గ్రామాల్లో మంగళవారం కరపత్ర ప్రచార నిర్మించడం జరిగింది. కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు, వ్యకాస నాయకులు కే నానయ్య పాల్గొన్నారు

ప్రజాశక్తి -మంగళగిరి

ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలో గల ఎయిమ్స్ ఆటో యూనియన్ సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చంగయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఆటో యూనియన్ నాయకులు ఎం వి సుబ్బారావు, షేక్ కాజా, పి రఫీ, మౌలా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు : మండలములోని పేరేచర్ల నీకో ఆయిల్ మిల్ ఆగ్రో కంపెనీలో మంగళవారం చలో ఢిల్లీ పోస్టర్ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు మాట్లాడుతు చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు ఎం వెంకటేష్ శ్రీనివాస్ రెడ్డి, సాంబయ్య మీర్సా , జాన్ పేరా ,సుధాకర్ రెడ్డి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


గుంటూరులో పోస్టర్ ఆవిష్కరణ


మేడికొండూరులో పోస్టర్ ఆవిష్కరణ


తాడికొండలో


మంగళగిరిలో


మంగళగిరి రూరల్ మండలంలో ప్రచారం

అసైన్డ్ రైతుల ఆవేదన అరణ్య రోదనేనా..?

ప్రజాశక్తి- తుళ్లూరు : మేం అధికారం లోకి వస్తే రాజధానిలోని అసైన్డ్ రైతులకు అదిచేస్తాం..ఇది చేస్తాం..అని డాంబికాలు పలికి ఏడాది గడుస్తున్నా కౌలు చెల్లించకుండా తాత్సారం చేయడం దారుణమని రాజధాని ప్రాంత అసైన్డ్ రైతులు వాపోయారు. కౌలు చెల్లించాలని ఇప్పటికి అనేకసార్లు సి ఆర్ డి ఎ కమిషనర్, ఇతర అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని, మా రోదన అరణ్య రోదనేనా ..అని వాపోయారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి కౌలు చెల్లించాలని కోరుతూ మంగళవారం తుళ్లూరులోని బి ఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ' అసైన్డ్ రైతులకు కౌలు చెల్లింపులో నిర్లక్ష్య వైఖరి వీడాలని ' నినాదాలు చేశారు. ఏడేళ్ల పాటు కౌలు చెల్లించిన ప్రభుత్వానికి ఈ ఏడాది భారమైందా.. అని నిలదీశారు. తుళ్లూరు ప్రాంతం లోని మెట్ట అసైన్డ్ భూములకు సంబంధించి ఎలాంటి అవకతవకలు లేవని, విచారణ పేరుతో ఏడాది పూర్తవుతున్నా కౌలు చెల్లించక పోవడం దారుణమన్నారు. రాజధాని నేపథ్యంలో వ్యవసాయ పనులు లేక పోవడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవడంతో దళితులు, పేదలైన అసైన్డ్ రైతుల జీవనం ఇబ్బంది కరంగా మారిందని మహిళా రైతు అంకం సువర్ణ కమల చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం అలసత్వం వీడి కౌలు చెల్లించాలని అసైన్డ్ రైతులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అసైన్డ్ రైతులు జొన్నకూటి ఏడుకొండలు,పేరం బాబురావు,పాబ త్తుల వేంకటేశ్వరరావు,ఎం నాగేశ్వరరావు(బుజ్జి), మేడావత్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా ఐక్యంగా ప్రతిఘటించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఉండవల్లి సిపిఎం కార్యాలయంలో సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ సమావేశం యర్రమనేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు కొనుగోలు చేయలేని విధంగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని విమర్శించారు. పెట్రల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు అకాశాన్నంటున్నాయని


ఉండవల్లి సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

మండిపడ్డారు. ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర కడగండ్ల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రధాని మోడీ సిద్ధమయ్యారని విమర్శించారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాజధానికి నిధులు, ప్రత్యేక హోదా, పోలవరం నిధులు ఊసేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంధాన్ని వినియోగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాథమిక హక్కులను హరించివేసి భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ బాటలోనే పయనిస్తుందని విమర్శించారు. ప్రజా ఉద్యమాలు, పోరాటాలపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. రాజధానిలో అసైన్డ్ రైతుల కౌలు చెల్లింపు కోసం టిడ్కో ఇళ్లు లబ్దిదారులకు ఇవ్వాలని సిపిఎం పోరుబాట పట్టనుందని చెప్పారు. సమావేశంలో ఎం.భాగ్యరాజు, వెంటకరేశ్వరరావు, సిహెచ్.సుందరరావు, ఎస్‌కె పీరూసాహెబ్ పాల్గొన్నారు.



2వ రోజుకు ఎయిమ్స్ సెక్యూరిటీ గార్డుల దీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఎయిమ్స్ వైద్యశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులను విధుల నుండి తొలగించడాన్ని నిరసిస్తూ తక్షణమే చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ వైద్యశాల గేటు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 2వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను మాజీ కౌన్సిలర్ వీసం జవహర్లాల్ ప్రారంభించారు. ఎయిమ్స్ సెక్యూరిటీ గార్డుల సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు సహాయ కార్యదర్శి రంగారావు వెంకటరామయ్య బుజ్జి రవికుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఆటో యూనియన్ అధ్యక్షులు ఎం.వి సుబ్బారావు, పి.రఫీ,కే.శ్రీనివాసరావు,పి. అదిబాబు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అవినీతిని సహించం

జిజిహెచ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ముస్తాఫా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : ప్రభుత్వ ఆసుపత్రి లో ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించనని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి తన సొంత నిధులతో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల ను అందచేశారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తో వివిధ సమస్యల పై ఆయన సమీక్షించారు. అనంతరం జనరల్ మెడిసిన్, ప్లాస్టిక్ సర్జరీ వార్డు, కాన్పుల వార్డు, చిన్న పిల్లల వార్డు ల్లో తిరుగుతూ అక్కడి సమస్యల గురించి సిబ్బంది, రోగులను ఆయన అడిగి తెలుసుకున్నారు. కాన్పుల వార్డులో కొంతమంది సిబ్బంది తమ వద్ద పుట్టిన శిశువు ను బట్టి సొమ్ములు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేయడంపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వార్డులోని మరుగు దొడ్లను పరిశుభ్రం గా ఉండటం పై సంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని వార్డుల్లో ఎ సి లు పని చేయక పోవడంతో వాటికీ వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ఆదేశించారు. అత్యవసర మైన ఎసిలకు వేంటనే తన సొంత నిధులతో మరమ్మత్తులు చేయాల్సింది గా ఆయన తన సిబ్బందికి సూచించారు. కాన్పుల వార్డుల్లో పేదలను జలగల్ల పీడిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని ఈ విషయం లో ఎవరైనా అవినీతి కి పాల్పడితే సహించనని అయన అన్నారు. సివిల్ సర్జన్ ఆర్. ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్, మాజీ కౌన్సిలర్ పి నాగేశ్వరావు, పాల్గొన్నారు.

వెనిగండ్ల జెడ్‌పి పాఠశాలను సందర్శించిన వరల్డ్ బ్యాంక్ బృందం

విద్యా, వైద్య రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ కృషికి అభినందనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పెదకాకాని మండలం వెనిగండ్ల జిల్లా పరిషత్ హై స్కూల్‌ను ప్రపంచ బ్యాంకు (ఇండియా) డైరెక్టర్ అగస్టే తనో కౌమే బృందం మంగళవారం సందర్శించారు. స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎన్‌సిఆర్‌టి డైరక్టర్ గాలెబ్, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సుబ్బారావు మంగళవారం పరిశీలించారు. మొదటగా ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ అగస్టే తనో కౌమే తొమ్మిదవ తరగతి విద్యార్దినిలతో మాట్లాడుతూ ఈ స్కూల్ మీ ఇంటి నుండి ఎంత దూరంలో వుందని ప్రశ్నించారు. సమీపంలోనే స్కూల్ సౌకర్యవంతంగా వుందని విద్యార్దినులు తెలిపారు. విద్య ఎందుకు అవసరమని, భవిష్యత్తులో మీరు ఏమి కావాలనుకుంటున్నారో వివరించాలని విద్యార్దులను డైరెక్టర్ ప్రశ్నించారు. పలు విద్యార్దినులు ఉన్నత చదువులు చేపడతామని డాక్టర్లు, ఇంజనీర్లు గా స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు. పాఠశాలలో ఉన్న ల్యాబొరేటరీ, టాయిలెట్లను డైరెక్టర్ పరిశీలించారు. విద్యార్దులకు మధ్యాహ్న భోజన పథకం క్రింద వండిన వంటలను పరిశీలించి విద్యార్థులకు శుచి, శుభ్రమైన మంచి పౌష్టికాహారం అందిస్తున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్దులతో భోజనం ఎలా వుందని అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ డైరెక్టర్ అగస్టే తనో కౌమే కు వివరిస్తూ రోజుకు ఒక మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, అలాగే ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించే భాగంలో రాగి జావను కూడా అందించడం జరుగుతున్నదని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులతో డైరెక్టర్ అగస్టే తనో కౌమే ముఖాముఖి మాట్లాడారు. అనంతరం డైరెక్టర్ అగస్టే తనో కౌమే మీడియాతో మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్ , స్కూల్ ను పరిశీలించడం జరిగిందని తెలుపుతూ, రాష్ట్ర ప్రభుత్వం వైద్యం, విద్యా రంగాల అభివృద్ధికి



ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నదని, రాష్ట్రంలోని మానవ వనరుల అభివృద్ధిపై ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని ప్రశంసించారు. ఈ రంగాలలోని సిబ్బంది అంకితభావంతో పని చేస్తున్నట్లు గమనించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాలను గణనీయంగా అమలు చేస్తున్న మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ కు తన కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో అమలు చేస్తున్న విద్య, వైద్య రంగాలకు ప్రపంచ బ్యాంకు తోడ్పాటు అందిస్తున్నదని తెలిపారు. ఈ రెండు సెక్టార్లకు పార్టనర్ గా ఉండడం సంతోషంగా ఉన్నదన్నారు. విద్యార్దులను తరగతి గదుల్లో చూసినప్పుడు తనకు ఎంతో సంతోషం కలిగిందని, అలాగే మధ్యాహ్న భోజనాన్ని వారు సంతోషంగా ఆస్వాదిస్తున్నారన్నారు. విద్యార్దులు చదువు నేర్చుకోవడానికి చూపుతున్న చొరవను ఇలాగే కొనసాగిస్తే భవిష్యత్తులో ఉన్నతంగా స్థిరపడతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమం ద్వారా విద్యార్దులకు మంచి మౌళిక వసతులు కల్పిస్తుండడం శుభపరిణామమన్నారు. జిల్లా విద్య శాఖాధికారి శైలజ, పెదకాకాని తహశీల్దార్ రత్నం, యంఇఓ ఖుద్దూస్ , ఏపి సాల్ట్ టీచ్ టూల్ టెక్నిషియన్లు వీరయ్య, గోపి, రమేష్, శ్రీధర్, స్కూల్ పేరెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి ఇద్దరికీ గాయాలు

ప్రజాశక్తి-దుర్గి

పిడుగుపడి ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని ఓబులేశునిపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. సాయంత్రం వేళ ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం రావడంతో అప్పటికే వివిధ పనుల మీద ఉన్న వారు గ్రామంలోని చెట్టుకిందకు చేరుకున్నారు. ఈ సందర్భంలో పిడుగుపడ్డంతో పత్తిపాటి రామయ్య, మహ్మమ్మద్ హుస్సేన్‌కు గాయాలయ్యాయి. వీరిని నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో రామయ్య అనే వ్యక్తి ఓటులేశునిపల్లెకు చెందిన రైతు కాగా, హుస్సేన్ గుంటూరుకు చెందిన వ్యక్తి. పొక్లెయినర్‌కు డీజిల్ మార్చడం కోసం వచ్చి పిడుగుపాటకు గురయ్యాడు.


పిడుగుపడిన ప్రదేశం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

చలోఢిల్లీ జయప్రదం కోసం ప్రచారం

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజలకు నష్టం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 5వ తేదీన నిర్వహించే చలోఢిల్లీని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని 14, 15 వార్డుల్లో కరపత్రాలను మంగళవారం పంపిణీ చేసి ప్రచారం చేశారు. నాయకులు బి.మహేష్, వి.వెంకటరావు, సురేష్, వెంకటరత్నం, శోభన్‌కుమార్ పాల్గొన్నారు.


మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

డ్వాక్రాలకు ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైయస్సార్ ఆసరా పథకం డ్వాక్రా సంఘాల మహిళలకు ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక కారంపొడి రోడ్డులోని బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 672 డ్వాక్రా సంఘాలకు నాలుగు కోట్ల 34 లక్షల 23 వేల 604 రూపాయలు ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో 12, 13, 14, 15 వార్డులకు సంబంధించి వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత పంపిణీని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ పైన పేర్కొన్న వార్డుల్లోని డ్వాక్రా మహిళలకు మూడేళ్లలో రూ.కోటిన్నర వరకూ లబ్ధి చేకూరినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, వై.ఇందిరా, వైసిపి నాయకులు కె.కిషోర్, భరత్, మాలతి, శ్యామ్ పాల్గొన్నారు.

బతకని మొక్కలు 7540

- ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారుల వెల్లడి
- 15 రోజుల్లో మళ్లీ నాటాలని ఆదేశం
- 85 లక్షల పనిదినాలు కల్పిస్తామని డ్వామా పీడీ ప్రకటన



సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

ప్రజాశక్తి - వినకొండ

గ్రామాల్లో కూలీల సంఖ్య పెరిగితే మెటీరియల్ కాంపొనెంట్ పెరుగుతుందని తద్వారా, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు మంజూరవుతాయని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ అన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై మంగళవారం అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. పంచాయతీ వారీగా నివేదికలను డిఆర్‌పిలు వివరించారు. ఎస్ఆర్పీ ఇదుబిల్లి పున్నప నాయుడు మాట్లాడుతూ 428 పనులకుగాను రూ.8 కోట్ల 95 లక్షల 43 వేలు ఖర్చు చేసినట్లు చెప్పారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన ఉపాధి సిబ్బంది, ఫీల్డు అసిస్టెంట్లకు కలిపి రూ.5 వేలు అపరాధ రుసుం, పనులకు సంబంధించి రూ.14,500 రికవరీ విధించినట్లు తెలిపారు. 14 పంచాయతీల్లో రెవెన్యూ ప్లాంటేషన్ కింద రూ.18.27 లక్షలతో 10290 మొక్కలు నాటామని, 2700 మొక్కలు బతికున్నాయని, రూ.15.24 లక్షల విలువైన 7540 మొక్కలు చనిపోయాయని చెప్పారు. 15 రోజుల వ్యవధిలో మొత్తం మొక్కలు నాటాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. లేకుంటే రికవరి విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.సుహాసిని అనిల్‌కుమార్, జెడ్‌పిటిసి పి.హైమావతి, ఏపీడీ బూసిరెడ్డి, ఎంపిడిఒ పి.శీతారామయ్య, ఏపీవో ఎంవీవీ రాజు పాల్గొన్నారు.

ప్రతి జాబ్‌కార్డుకు 100 రోజుల పని : పీడీ

జాతీయ ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన పనుల్లో ఎప్పటి కప్పుడు పురోగతితో పాటు ఉపాధి కూలీల సంఖ్యను పెంచి ప్రతి జాబ్ కార్డుకు 100 రోజుల పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించినట్లు డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్ చెప్పారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 80 లక్షల పని దినాలు కల్పించామని, వచ్చే ఆర్థిక సంవత్సరానికి 85 లక్షల వరకు పెంచేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 50 వేల మంది జిల్లావ్యాప్తంగా ఉపాధి పనులకు హాజరవుతున్నారని, ఏప్రిల్ ఒకటి నుండి లక్ష వరకు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. కూలీలకు హాజరు వేయు ఎన్ఎంఎంఎస్ పని చేయకపోయినా మ్యాన్యుల్‌గా హాజరు తీసుకుంటామన్నారు. చెరువుల్లో పూడిక తీయడం, కాల్వలు, కుంటలు తదితర పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కింద అభివృద్ధి పనులు చేసి, నిధులు రాక కోర్టుకు వెళ్లిన వారందరికి నిధులు విడుదల చేశామన్నారు. రెండు నెలలుగా ఉపాధి కూలీల వేతనం జమ కాలేదనే ప్రశ్నకు స్పందిస్తూ అవి కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని, త్వరలో జమవుతాయని తెలియజేశారు.

లీజుకు ఆర్టీసీ డిపో స్థలాలు : డిఎం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల


పిడుగురాళ్ల పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మూడు ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ ఎన్.ముక్తేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మూడు ఖాళీ స్థలాలను ఐదేళ్లు లీజుకిచ్చేందుకు టెండర్లు ఆహ్వానించామని, కారంపూడి బస్టాండ్లో షాపులు కూడా ఇచ్చేందుకు టెండర్ ఆహ్వానిస్తున్నామని చెప్పారు. అరుణాచలం దేవాలయం వరకు పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని, నాలుగో తేదీ నుండి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. 36012 సర్వీసు బస్సు పిడుగురాళ్లలో ఏప్రిల్ 4వ తేదీన రాత్రి 10 గంటలకు బయలుదేరి నరసరావుపేట, అద్దంకి, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా అరుణాచలం వరకు వెళ్తుందని, ఏడో తేదీ ఉదయం 8 గంటలకు పిడుగురాళ్లకు చేరుకుంటుందని వివరించారు. రూ.2,500 ఛార్జీ ఉంటుందని, ఇతర వివరాల కోసం ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ 9849556384కు సంప్రదించాలని సూచించారు.



కోటప్పకొండలో 'కోటక్ మహీంద్ర' ప్రారంభం

ప్రజాశక్తి - నరసరావుపేట : కోటప్పకొండలో కోటక్ మహేంద్ర బ్యాంకింగ్ సేవలు మంగళశారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి పాల్గొని బ్యాంకును ప్రారంభించారు. బ్యాంకు ఆవరణలో ఏటీఎం కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు శ్రీధర్‌రావు, రామసుధాకర్ పాల్గొన్నారు.

పరీక్షల వేళ విద్యార్థినులకు వితరణ


ముప్పాళ్ల మండలం గోళ్లపాడు కెజిబివిలో పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఒత్తిడిని దరిచేరనీయకుండా పరీక్షలను ప్రశాంతంగా రాయాలని, అందరూ మంచి మార్కులు ఆధించాలని విద్యార్థినులకు ఎంపిపి ఎం.పద్మ రామలింగారెడ్డి సూచించారు. మండలంలోని గోళ్లపాడులోని కెజిబివి బాలికల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అభినందన ఆర్ఫన్ అండ్ నీడి సేవా సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు కె.సరేంద్రబాబు అందరూ బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యాపరంగా ఏమైనా అవసరాలుంటే తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేకాధికారి ఝాన్సీ, సొసైటీ సభ్యులు ఎం.కోటేశ్వరరావు, పి.రామారావు, ఉపాధ్యాయినులు స్వరూప, ప్రేమలత, ప్రసన్న, అరుణకుమారి, కృష్ణవేణి, విజయకుమారి, అరుణకుమారి పాల్గొన్నారు.


సత్తెనపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కస్తూర్బా బాలికల విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చారు. వీటిని ఎజిపి షేక్ బాలిసైదా ద్వారా మంగళవారం అందించారు. ఈ సందర్భంగా బాలిసైదా మాట్లాడుతూ పరీక్షలని ఎవరూ ఒత్తిడికి గురి కావొద్దని, ఆత్మ విశ్వాసంతో రాయాలని సూచించారు. అందరూ బాగా చదివి ఉన్నత శ్రేణిలో మార్కులు సాధించాలని, జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. సంస్థ నిర్వాహకులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ దాత అందించిన సహకారంతో విద్యార్థినులకు పరీక్షలకు అవసరమైన వస్తువులను అందించామన్నారు. ప్రిన్సిపాల్ ప్రసన్న, న్యాయవాది చావా బాబురావు, హెల్ప్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని జెడ్‌పి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. 75 మంది పరీక్ష అట్టలు, జామెంట్రీలు, స్కేలు, పెన్ను, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.వీరాంజనేయులు, ఫౌండేషన్ సభ్యులు మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాద్, కిరణ్ కుంచనపల్లి పాల్గొన్నారు.

31 తర్వాత వడ్డీ మాఫీ వర్తించదు : కమిషనర్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఈ ఆర్థిక సంవత్సరం మరో మూడ్రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులు తమ బకాయిలను ఒకేసారి చెల్లించి వడ్డీ మాఫీ పొందాలని కమిషనర్ సిహెచ్ గోంవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. 31వ తేదీ తర్వాత చెల్లించే బకాయిలకు వడ్డీ మాఫీ వర్తించదని తెలిపారు.



హమాలీలకు యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి-దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో పనిచేస్తున్న హమాలీలకు మంగళవారం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చేతుల మీదుగా యూనిఫామ్ అందజేశారు. 46 మంది పురుష హమాలీలకు 35 మంది మహిళ హమాలీలకు లక్ష పాతికవేల రూపాయలు ఖర్చు తో యూనిఫామ్‌ను అందజేశారు. యార్డులో పని చేస్తూ ఇటీవల మరణించిన రేవేంద్రపాడు గ్రామానికి చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పాండురంగారావు కుటుంబానికిప్రావిడెంట్ ఫండ్ ద్వారా రూ.4 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా, రూ.2 లక్షల నగదును మట్టి ఖర్చుల నిమిత్తం అందజేశా మన్నారు. కుటుంబంలో అర్హత కలి గిన వారు ఒకరికి ఉద్యో గం ఇప్పించేందుకు కృషి చేస్తా మన్నారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ షేక్ బాజీ మాజీ చైర్మన్ కె. ముత్తయ్య, ఆప్కో చైర్మన్ జి. చిరంజీవి, ఎంపిపి డి.సంతోష రూపవాణి, జడ్పిటిసి ఎం.అరుణ, యార్డు సెక్రటరీ ఎన్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నాటక కళాకారుడు వెంకటేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరుగు తున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మ సాని థియేటర్‌లో మంగళవారం ఎన్టీఆర్ నటించిన దేవాం తకుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారుడుని సన్మానించే కార్యక్రమంలో పట్టణ పౌరాణిక నాటక కళాకారుడు పసుపులేటి వెంకటేశ్వరరావును పార్టీ విశ్రాంత ఉద్యో గులు కె రాఘవేంద్రరావు, యు.నాగేశ్వరరావు, సిహెచ్ వెంక టేశ్వరరావు, కొడాలి రమేష్ లు సత్కరించి జ్ఞాపిక అందించారు.



రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని జాతీయ సేవా పథకం దత్తత గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హను మంతరావు పేర్కొన్నారు. ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళ వారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 9 ఆధ్వర్యంలో ప్రాతూరులో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమా దాలు కుటుంబాలను చిన్నా బిన్నం చేస్తున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. వాహనదారులు తప్పని సరిగా ట్రాపిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ బాసిత్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్. నవీన్ పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వాలంటీర్లను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స లర్ డాక్టర్ జి. పార్థసారధివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, వ్యవసాయ విభాగా ధిపతి సెంథిల్ మురుగన్, డైరెక్టర్ పి. రత్న ప్రసాద్, సాక్ డైరెక్టర్ పి. సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె. రూత్ రమ్య, సమ న్వయకర్తలు పి. సురేష్, జి. చంద్రశేఖర్ అభినందించారు.

31న మందడం రైతు దీక్షా శిబిరంలో సమావేశం

ప్రజాశక్తి - తుళ్లూరు

శాంతి,అహింసా మార్గాన సాగుతున్న రాజధాని అమరావతి ఉద్యమం ఈ నెల 31 వ తేదీకి 1200 రోజు లకు చేరనుంది. ఈ సందర్భంగా ఈ నెల 31న మందడం రైతు దీక్షా శిబిరంలో రైతు,రైతు కూలీలు, మహి ళలు సమావేశం కానున్నట్లు రాజధాని ఐక్య కార్యాచరణ సమితి నాయకులు తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణ ఆవశ్యకతను తెలియజేస్తూ రాజధాని రైతు ఐక్య కార్యాచరణ సమితి,అమరావతి పరిరక్షణ సమితి, దళిత, మైనార్టీ జెఏసి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్య క్రమానికి గుంటూరు ఎంపి గల్లా జయదేవ్, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ,నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, బిజెపి జాతీయ కార్యదర్శి వై.సత్య కుమార్, జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసి రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుంకర పద్మశ్రీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.



రామకృష్ణ, సిపిఎం స్టేట్ సెక్రెటరీ శ్రీనివాస్ హాజరుకానున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొన సాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు,రైతు కూలీలు, మహిళలు చేస్తున్న దీక్షలు మంగళవారంతో 1197వ రోజుకు చేరాయి. తుళ్లూరు, అనంతవరం,వెలగపూడి, మందడం, వెంకటపాలెం, నెక్కల్లు తదితర గ్రామాల్లో దీక్షలు కొనసాగాయి. అమరావతి వెలుగు కార్య క్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి 'జై అమ రావతి' అంటూ నినాదాలు చేశారు.

'అభివృద్ధి,సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు'

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అభివృద్ధి,సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వము కార్యక్రమం స్థానిక 15వ వార్డు పాత ఆర్టిసి డిపో నుండి మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్థానిక కౌన్సిలర్, కోటేశ్వరరావు తో గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. అనంతరం పాత్రి కేయు లతో ఎమ్మెల్యే మాట్లాడుతూ 411 నివాస స్థలాలను 15వ వార్డులో మంజూరు చేయించా మన్నారు. బ్రాహ్మ ణులకు సుమారు 800 ఇళ్ళు మం జూరు చేయించిన, బ్రాహ్మణపరిషత్ సహకారంతో ఈబీసీ నేస్తం లబ్ధి దారు లకు రూ.15 వేలు ఇప్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. సం క్షేమ పథకాలను అందరికీ అందాలన్నదే జగన్మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. ప్రభు త్వానికి ప్రజలకు వారధిలా వ్యవ హరిస్తున్న అధికారులు పనితీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నేతలు వార్డులో సమస్యలను ఎమ్మెల్యే చెంతకు తీసుకు వచ్చారు. సమస్యల పరిష్కారా నికి వెంటనే కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. తెనాలి 40 వార్డుల్లో ప్రజలు ఎమ్మెల్యే శివకుమార్ కు బ్రహ్మరథం పడుతున్నారని వైస్ చైర్మన్ కోటేశ్వరరావు అన్నారు. స్థానికులకు 40 నూతన పెన్షన్లను ఇప్పించామని అన్నారు. సిసి రోడ్ల నిర్మానంతో పాటు, సమస్యాత్మక ప్రదేశాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి స్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు గోపి రాజ్, ఎం రఘునాధ్, లక్ష్మణశాస్త్రి, శ్రీనివాస్, శేషగిరి,



గెడ్డటి ఝాన్సీ వాణి, యాతట అనీల్, అక్కిదాసు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణి

మహిళా సాధికారతకు నిరంతరం పాటుపడతూ పలు సంక్షేమ పథకాలతో స్వయం సహాయక సంఘాల గ్రూపులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ గ్రామం పెదరావురు, పట్టణ పరిధి చెంచుపేటలో మూడవ విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పరి ధిలోని పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, చావావారి పాలెం, ఖాజీ పేట కోపల్లె, అంగలకుదురు, సంఘం జాగర్లమూడి, బుర్రిపాలెం, నేలపాడు, తేలప్రోలు, సోమసుందరపాలెం గ్రామాల్లో 663 గ్రూపులకు రూ 5.38.55.931 కోట్ల చెక్కును లబ్దిదారులకు పంపిణీ చేశారు. తెనాలి పట్టణ పరిధిలో 37వ వార్డు సాయి స్కూల్ ఆవరణలో 19, 20, 35, 36, 37, 38 వార్డుల్లో 1824 ద్వాక్రా సభ్యులకు రూ 1.45 కోట్ల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. జగన్మోహన్ రెడ్డి గద్దెనెక్కాక ద్వాక్రా మహిళలకు వేన్నీళ్ళకి చన్నీళ్లలా సహాయ పడుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

చైల్డ్ లైన్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక మారిస్ పేట ఎన్సీఆర్ఎం ఉన్నత పాఠ శాలలో రైల్వే చైల్డ్ లైన్, తెనాలి ఆర్పిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చైల్డ్ లైన్ సేవలు, స్టోన్ పెల్టింగ్ ఆన్ ట్రైన్స్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అవగాహన సదస్సులో సుమారు 560 మంది విద్యా ర్థులు పాల్గొన్నారు. గుంటూరు ఎహెచ్‌టి యు ఎఎస్ఐ లక్ష్మీ ముఖ్య అతిథిగా పాల్గొని సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. బాలల అక్రమ రవాణాకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్తు పదార్థాలు, ధూమ పానం వల్ల జరిగే నష్టాలను వివరించారు. తెనాలి ఆర్ పిఎఫ్ ఎఎస్ఐ ఎం.శివరామకష్ణయ్య మాట్లాడుతూ పిల్లలు రైల్వే ట్రాక్ దాటే సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చలనంలో ఉన్న రైళ్ల పై రాళ్ళు విసరడం వలన ఏర్పడే పరిణామాలు తీవ్రతలను వివ రించారు. చైల్డ్ లైన్ నోడల్ కోఆర్డినేటర్ సుగుణ రాణి మాట్లాడుతూ చైల్డ్ లైన్ యొక్క సేవల గురించి 1098 టోల్ ఫ్రీ నెంబర్ ఆవశ్యకతను, ఉపయోగాలను వివరించారు. గుంటూరు రైల్వే చైల్డ్ లైన్ కోఆర్డినేటర్



కిషోర్, గ్లోరియా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బషీర్ అహ్మద్, లక్ష్మణ్ నందన్, జెల్సియా పాల్గున్నారు.

3 వరకు పోషణ పక్వాడ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఏప్రిల్ 3వ తేదీ వరకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం జరుగుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భవానీ చెప్పారు. పెను మాక ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం చిరుధాన్యాలపై తల్లులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఏ ధాన్యాల్లో ఏయో పోషకాలు ఉం టాయో వివరించారు. సజ్జలు, రాగులు, జొన్నలు, కొర్రలు వాటిలో ఉండే పిండి పదార్థాలు రక్త హీనతను ఎలా ఎదుర్కొంటాయో తెలియజేశారు.



ప్రమాద భరితంగా ఆర్ అండ్ బి మార్జిన్

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ఆర్ అండ్ బి మార్జిన్లు ప్రమాదకరంగా ఉన్నాయని, పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పం దించడం లేదంటూ పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సం ఘం అధ్యక్షులు దరిశి శివ కోటేశ్వరరావు ఆరోపించారు. సంఘ సభ్యులతో కలిసి మంగళవారం-తెనాలి-విజయ వాడ రోడ్డులో మార్కెట్ వంతెన వద్ద భక్తాంజనేయ స్వామి గుడికి ఇరువైపులా గల రోడ్డు మార్జిన్ లో పెద్ద పెద్ద గుంత లను పరిశీలించారు.ఈ గోతులలో పడి వృద్ధులు గాయ పడుతున్నారని చెప్పారు. పాదచారులు కూడా ఈ గోతు లలో పడి కాలువల్లోకి జారిపోయే ప్రమాదం ఉందన్నారు. గతంలోనూ ఆర్ అండ్ బి అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి, కనీసం గోతులను పూడ్చి కాలువ అంచుకు గోడ నిర్మించాలని కోరారు. గోతులలో పడి ఎవరైనా మరణిస్తే అందుకు ఆర్ అండ్ బి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బి.వెంక టేశ్వరరావు, ఎన్.కమలకుమార్,ఆర్ఎస్ శంకరరావు, అబ్దుల్ ఆరిఫ్, అబ్రహం లింకన్, వి.పేరిరెడ్డి, శివరామయ్య, సిహెచ్ మురళీమోహనరావు పాల్గొన్నారు.



కాపు సంక్షేమ సేన అధ్యక్షునిగా తిరుమలశెట్టి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గ కాపు సంక్షేమ సేన అధ్య క్షునిగా నగరానికి చెందిన తిరుమలశెట్టి కొండలరావు నియ మితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కొండలరావును నియమిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా కాపు సంక్షేమ సేన అధ్యక్షులు బండి శ్యాంప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తిరుమలశెట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాపులను సంఘటితం చేసి కాపు జాతి అభివృద్ధికి కృషి చేస్తా నన్నారు. ఈ సందర్భంగా కొండలరావును పలువురు కాపు ప్రముఖులు అభినందించారు.



36 గంటల చేనేత దీక్షను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మంగళగిరి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగానికి తీవ్రమైన అన్యాయం చేస్తు న్నాయని చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా హేమ సుందర్‌రావు, ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగే శ్వరరావులు విమర్శించారు. మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని మంగళగిరి (వేములపల్లి శ్రీకృష్ణ భవన్)లోని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కార్యా లయంలో మంగళవారం నిర్వ హించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఏప్రిల్ 3,4 తేదీలలో శ్రీ సత్య సాయిజిల్లా ధర్మ వరంలో జరిగే 36 గంటల దీక్షలో చేనేత అనుబంధ వర్గా లన్నీ దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. చేనే త కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ తమ పోరాటం దశల వారీగా ఉంటుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ చేనేత గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్య దర్శు లు జి.వెంకట కృష్ణ, బి. మోహన్‌రావు, మంగళగిరి నియోజక వర్గ అధ్యక్ష కార్యదర్శులు బి,గిరి, డి. ఈశ్వరరావు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరులో రీసర్వేపై జేసీ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రీసర్వే ప్రాజెక్టు అమలు తీరును తెలుసుకునేందుకు జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి మంగళవారం వట్టిచెరుకూరు మండలం, వట్టిచెరుకూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 173 గ్రామాలలో రీసర్వే ప్రక్రియ ప్రారంభించటం జరిగిందని, ఇప్పటి వరకూ 98 గ్రామాలలో డ్రోను ఫ్లై కార్యక్రమం పూర్తి అయ్యిందన్నారు. మిగిలిన 75 గ్రామాలలో డ్రోను ఫ్లై కార్యక్రమము జరుతుందని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో నాలుగు గ్రామాల్లో 13 నోటిఫికేషన్ ప్రకటన, రెండు గ్రామాలలో ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తి అయ్యిందన్నారు. స్వామిత్వ ఆభాది సర్వేలో భాగముగా ఇప్పటివరకు నాలుగు (గ్రామాలలో ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తి అయినట్లు వివరించారు. వట్టిచెరుకూరు గ్రామంలో సర్వేపనుల గురించి సమీక్షా నిర్వహించి, రికార్డులు తయారీలో విఆర్ఒ ముందుగానే సమాచారం సేకరించి రికార్డులలో మార్పులపై వెంటనే తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. రీసర్వేకు పూర్తిగా సహకరించాలని గ్రామ రైతుల్ని కోరారు. రీసర్వేలో తనిఖీ కోసం జేసీతోపాటు, సర్వే ఏడీ రూప్లా నాయక్, తహసీల్దార్ నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రాంగణ ఎంపికల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజి విద్యార్థులు చెన్నైకి చెందిన ప్రముఖ ఫార్మారంగ సంస్థ ఎపి సోర్స్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాధర మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపికకు నిర్వహించిన వివిధ దశల్లో తమ విద్యార్థులు నైపుణ్యం కనబరిచి 55 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారు చెన్నై కేంద్రంగా ఉన్న ఏపీ సోర్స్‌లో మెడికల్ కోడింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తారని, రూ.2.50 లక్షల వార్షిక వేతనం అందుకుంటున్నారన్నారు. ఆయా విద్యార్థులకు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ సి.ఎన్.శ్రీనివాస్, కళాశాల కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ అభినందించారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో లేఅవుట్స్ వారిగా నోడల్, హౌసింగ్ అధికారులు ఇళ్ళ నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం జిఎంసి కాన్ఫరెన్స్ హాల్లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులతో జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనులపై సమీక్షించారు.కమిషనర్ తొలుత లేఅవుట్స్ వారీగా ఇళ్ళ నిర్మాణం ఏ మేరకు పూర్తి అయింది, గ్రౌండ్ లెవల్‌లో ఎన్ని ఉన్నాయి, మౌలిక వసతులు, బిల్లులు చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాల గురించి అధికారులను, ఏమినిటి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణపనులు వేగంగా జరగాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి లేఅవుట్ నుండి కాంట్రాక్టర్ ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. లేఅవుట్‌లలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్దిదారులు ఇళ్ళ నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో జిఎంసి ఎస్.ఈ.భాస్కర్, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, హౌసింగ్ ఈ.ఈ. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

టిజెపిఎస్‌లో ఉచిత నేత్ర, దంత వైద్యశిబిరాలు



ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక టిజెపియస్ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు ప్రత్యేక శిబిరంలో భాగంగా చల్లావారిపాలెంలో మంగళవారం శ్రీ లక్ష్మి సాయి ఆప్టికల్స్, హ్యాపి డెంటల్ క్లినిక్ సహాయంతో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారని సర్పంచ్ ఆరుదల సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల కోసం, వారు ఆరోగ్యం గా ఉండటం కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పేర్కొన్నారు. శ్రీ లక్ష్మి సాయి ఆప్టికల్స్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజలు ఈ కాలంలో తీసుకునే ఆహార పదార్థాల కారణంగా శరీరంలో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయని, అందులో భాగంగా నేత్రానికి సంబంధించిన సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఇటువంటి వారికి ప్రత్యేకంగా ఉచితంగా కం ప్యూటర్ ద్వారా పరీక్షలు నిర్వహించిన మందులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. హ్యాపీ డెంటల్ క్లినిక్ ప్రతినిధులు మాట్లాడుతూ జీవన విధానంలో అనేక మార్పుల వలన దంత క్షయం జరుగుతుందని, అతి శీతల పానీయాలుకానీ, జంక్ ఫుడ్ కానీ తినకూడదని , మంచి ఆహారం తీసుకుంటే ఎటువంటి సమస్యలు రావని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్. జె. వి. సుధీర్ కుమార్, వి. ఆర్. ఓ.లూర్ధు రాజు, గ్రామ పెద్దలు ఇంటూరి సాంబ శివా రెడ్డి (పెద్ద బాబు),పాపి రెడ్డి, పాల్గొన్నారు

మహిళాభ్యున్నతి, శిశు సంక్షేమంతోనే మెరుగైన సమాజం

పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి - నరసరావుపేట

మెరుగైన సమాజం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా సాధ్యమని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. కలెక్టరేట్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్ లో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణిలతో మంగళ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మరింత కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు సరైన పౌష్టికాహారం అందించాలన్నారు. మహిళ శిశు



సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను, ఐసిడిఎస్ ద్వారా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం అమలు తీరు అడిగి తెలుసు కున్నారు. పిల్లల్లో ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చర్యలు తీసుకోవాలని, వారికి బలమైన ఆహారం అందించడంతో పాటుగా వ్యాయామం తప్పని సరిగా చేయించాలని ఆదేశించారు. పిల్లలు బరువుకు తగ్గ ఎత్తు కూడా పెరిగేలా ఆటలను ఆడించాలని పేర్కొన్నారు. గర్భిణులు, బాలితల వివరాలను జిల్లాలో క్షేత్ర స్థాయిలో సేకరించాలన్నారు. పల్నాడు జిల్లాలో 65 శాతం మంది మాత్రమే పౌషికాహారం స్వీకరిస్తున్నారని, మిగతా వారికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ నెలలో పూర్తి నివేదికలతో రావాలని సంబంధిత అధికారిణిలను ఆదేశించారు. ఆరోగ్యశాఖ అధికారులతో అంగన్వాడీలు సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. జిల్లాలో ఫేజ్ 1, ఫేజ్ 2 ద్వారా నిర్మాణంలో ఉన్న అంగన్ వాడి కేంద్రాలు, వాటి పరిస్థితులను అడిగి తెలుసుకొని అద్దె భవనాలనుంచి సొంత భవనాల్లోకి వెళ్లేందుకు శాసన సభ్యుల సహకారం తీసుకోవాలన్నారు. మే నెల మొదటి వారంలో మరోసారి పూర్తి స్థాయిలో సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణ, సిడిపిఒలు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంతోనే అధికోత్పత్తి సాధ్యం

సంగం సీడ్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఆలపాటి సత్యన్నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు



ప్రపంచంలో రోజు రోజుకు పెరుగుతున్న వాతావరణ మార్పులు, పర్యావరణ సమస్యలు, పెరుగుతున్న జనాభాకు తగ్గ స్థిరమైన ఉత్పత్తిని సాధించాలంటే సుస్థిర వ్యవసాయంతోనే సాధ్యమని సంగం సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'క్లైమెట్ స్మార్ట్ అగ్రికల్చర్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ మంగళవారం ముగిసింది. సదస్సులో ఆలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ సుస్థిర వ్యవసాయాన్ని సామాజిక, పర్యావరణ, ఆర్థిక రంగాలుగా విభజించవచ్చని, సుస్థిర వ్యవసాయ పద్ధతులను వినియోగిస్తున్నప్పుడు ఎదురయ్యే అడ్డంకులను గుర్తించడంతోపాటు వాటిని అధిగమించడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు పునరుత్పాదక శక్తిపై ఆధారపడటం, రసాయన ఎరువుల వినియోగం, వనరుల కొరత తగ్గించుకోవచ్చన్నారు. ధార్వాడలోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్ఆర్ హంచినల్ మాట్లాడుతూ సీడ్ ఇండస్ట్రీలో ఉన్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్- ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కే. మాథూర్ పెరుగుతున్న దేశ జనాభాకు అవసరమైన వంట నూనెల్లో ఎక్కువ శాతం విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని, కావున నూనె గింజల ఉత్పత్తిలో దేశ ప్రజల అవసరాలు తీర్చడానికి పెద్ద ఎత్తున వివిధ వ్యవసాయ బౌగోళిక మండలాలో అక్కడి వాతావరణ పరిస్థితులకు అనువైన పంటల సాగు చేపట్టడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరంలోని ఐసీఏఆర్, సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణం, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాధన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ హ్యాక్‌థాన్‌లో సత్తా చాటిన వివిఐటి విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల నంబూరు విద్యార్థిని అంతర్జాతీయ హ్యాక్‌థాన్‌లో సత్తా చాటింది. ఏకంగా రూ.5వేల అమెరికన్ డాలర్లను సొంతం చేసుకుంది. కళాశాల్లో విద్యార్థినిని మంగళవారం వివిఐటి విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ జాతి సంస్థ వర్చుని టెక్నాలజీస్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్లోబల్ హ్యాక్‌థాన్ 'ఇంజనీరింగ్ ఈక్విటీ హ్యాక్స్' అంశంపై నిర్వహించిన పోటీలో కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజి విద్యార్థిని మేఘన శ్రీరాం బృందం పాల్గొంది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, మొదటి స్థానం పొందటమే కాకుండా రూ.5వేల అమెరికన్ డాలర్లు, అంటే దాదాపు రూ.4,17 లక్షల రూపాయలను సొంతం చేసుకున్నారు. రెండు విడతలుగా ఐదు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 67వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారిలో 100 మంది విద్యార్థులు రెండో రౌండ్‌కు అర్హత సాధించారన్నారు. వారిలో ఐదుగురు సభ్యులు గల మేఘన శ్రీరాం బృందం మొదటి బహుమతిని కైవశం చేసుకోవటం కళాశాలకే గర్వకారణంగా చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లిఖార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ కుమారస్వామి, ఐటి విభాగాధిపతి డాక్టర్ ఆళ్ళ కళావతి, ఉపాది కల్పనా శిక్షణాధికారి డాక్టర్ యు.మాధవయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.


మేఘన శ్రీరాంను అభినందిస్తున్న వివిఐటి బృందం

తృణధాన్యాల ఆహారం శ్రేయస్కరం

ప్రజాశక్తి-గుంటూరు

బియ్యం ఉత్పత్తులకు ముందు శతాబ్దాల పాటు తృణధాన్యాలతో ఆహారం తీసుకున్న మనుషులు పూర్తి శారీరక దారుఢ్యంతో ఉండేవారని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి జాతీయ కార్యవర్గ సభ్యురాలు బొల్లాప్రగడ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బ్రాడీపేట బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో 'మిల్లెట్స్ ఆహారంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు' నిర్వహించారు. ఏమాత్రం హానికరం కాని చిరుధాన్యాల ఆహార పదార్థాలను తీసుకోవటం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుత వ్యవసాయ ఉత్పత్తులు అన్నీ రసాయనాలతోనే వస్తున్నాయని, వాటిని తినటం వల్ల అనేక రకాల రోగాల బారిన పడి ఆసుపత్రుల ఖర్చులకోసం జీవితాలను తాకట్టు పెట్టాల్సి వస్తుందన్నారు. జిల్లా ఆయుష్ విభాగం వైద్యురాలు డాక్టర్ ఉమా సుందరి మాట్లాడుతూ రాగులు, సజ్జలు, జొన్నలు, అరికెలు, సామలు, వంటి చిరుధాన్యాలతో వండే ఆహారం తీసుకోవడం వల్ల సులువుగా అరుగుదలతో పాటు శరీరానికి కావలసిన పోషక పదార్థాలన్నీ సమకూరుతాయన్నారు. రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. రక్తహీనతతో ఇబ్బంది పడే బాలికలు, మహిళలు తృణధాన్యాల ఆహార ఉత్పత్తులను తినటం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చిరుధాన్యాలతో తయారుచేసిన బిస్కెట్లు, రాగి జావ అందించారు. కార్యక్రమంలో మన్నవ హనుమ ప్రసాద్, తాడువాయి నాగరామకష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కౌసల్యాదేవి తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు ఆఫ్ బరోడా ఉదారత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతీయ అధికారులు రూ.3 లక్షల విలువైన బారికేడ్స్‌ను మంగళవారం సాయంత్రం జిల్లా ఎస్‌పికి అందచేశారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం సమక్షంలో ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ వీటిని స్వీకరించారు. ఎస్‌పి మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా ట్రాఫిక్ రద్దీ దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ లో నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా బ్యాంక్ ఆఫ్ బరోడా అధినేతల సహకారంతో అందించినందుకు అధికారులను అభినందించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా గుంటూరు రీజినల్ మేనేజర్ పి అమరనాథ రెడ్డి, అధికారులు ఎం.పి. సుధాకరరావు, అదనపుఎస్‌పి శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు